# "ఓడిపోను"

కొండా కుసుమ కుమారి



**పాలవాడి కేకలతో చప్పున మెలకువ వచ్చింది వెంకట్రావుకి. మూడు నెలల పాలబాకీ గురించి అతడు రాజ్యాన్ని నిలదీస్తూ డబ్బులిస్తే గానీ పాలు పొయ్యనంటున్నాడు.**

**ఒక్కపూట పాలు లేకపోతే పిల్లలు ఎంత గొడవ చేస్తారో చెబుతూ బ్రతిమలాడుకొంటూంది రాజ్యం.**

వారం రోజులుగా ఇదే వరస.

వాకిట్లో కొచ్చి పాలవాడిని నాలుగు తిట్టాలన్నంత కోపం వచ్చింది వెంట్రావుకి. కాని తనని చూస్తే అతడు మరింత రెచ్చిపోతాడని, అసలు ఈ పాటికి ఇరుగు పొరుగు వాళ్లంతా గుమ్మాల్లో నిలబడి చోద్యం చూస్తుంటారని గుర్తొచ్చి విరమించుకొన్నాడు. అయినా ఇటువంటి పరిస్థితుల్ని గట్టెక్కించాలంటే రాజ్యమే

మేలనిపించింది.

చివరకు ఎలాగో పాలు పోయించుకొని లోపల కొచ్చింది.

"ఎరియర్స్ రాగానే డబ్బు వాడి మొహాన కొట్టి నాలుగూ అడుగుతాను ఈడియట్! మంచీ మర్యాద లేకుండా మాట్లాడుతాడా?" అన్నాడు.

"ఇప్పటికి చాలా రోజులుగా ఈ మాట వింటూనే ఉన్నాను" అంటూ కోపంతో మొహం తిప్పుకొంది.

అంతలో బయట నుండి రివ్వున దూసుకొచ్చాడు బాబీ.

"అమ్మా! పాతబాకీ ఇవ్వందే కాఫీపొడి ఇవ్వనన్నాడే షాపువాడు" అంటూ.

ఆ మాటకు మరింత మండిపడుతూ "వెధవా! అలా వీధిలో నుండి అరవక పోతే ఆ ముక్క ఇంట్లో కొచ్చి చెప్పొచ్చుగా!" అంటూ వీపు మీద ఒక్కటిచ్చింది.

వాడు రాగం అందుకొన్నాడు.

వెంకట్రావు బాబీని దగ్గరకు తీసుకొని బుజ్జగిస్తుంటే వరండాలోనుండి ఖంగుఖంగున దగ్గు వినిపించింది.

ఊపిరాడదు, ప్రాణం పోదు అన్నట్లు నరాలు తెగే దగ్గుతో మెలికలు తిరిగి పోతున్నాడు పరంధామయ్య.

తండ్రిని లేపి కూర్చోబెట్టి అరచేత్తో గుండె రాస్తూ "రాజ్యం! కాస్తంత అమృతాంజనం తీసుకురా" అంటూ పిలిచాడు.

"అది అయిపోయి నెలాళ్లయింది మీకు గుర్తుంటేగా?" అంటూ మంచినీళ్ల గ్లాసుతో వచ్చింది.

నీళ్లు తాగించి ఛాతీ నిమిరి పడుకోబెడుతూ "సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ మందులు తీసుకొస్తాను నాన్నా" అన్నాడు.

ఆ మాట అతడికే పేలవంగా వినిపించింది.

పరంధామయ్య ఆయాసంతో కళ్లు మూసుకున్నాడు మాట్లాడకుండా. రాజ్యం అదోలాంటి నిరసనతో కూడిన నిట్టూర్పు విడిచి లోపలకు నడిచింది.

వెంకట్రావుకి ముళ్ల చట్రాలేవో తన చుట్టూ బిగుస్తున్నట్టనిపించింది. మనసు గిలగిలలాడి పోయింది.

రాజ్యం 'అదిలేదు ఇది లేదు' అంటూనే చివరకు ఆ పూటకి వంట అయిందనిపించి భర్తను భోజనానికి పిలిచింది.

కంచం ముందు కూర్చోబోతుంటే ఇంటి యజమాని వచ్చాడు అద్దె కోసం. గుండెలు పీచుపీచుమన్నాయి.

"ఏమిటయ్యా! ఫస్టు తారీఖు జీతం తీసుకోగానే



అద్దె డబ్బు పంపించటం తెలియదూ. పనిగట్టుకొని ఇంటికి రావాలా! గవర్నమెంటు ఉద్యోగస్తుడివైన నీకే ఇంతకష్టమైతే అద్దెల మీద ఆధారపడి బతికే వాళ్లం మా మాటేమిటి? మేం ఎట్లా బతకాలి?" నిలదీశాడు.

వెంకట్రావు ఆయన చేతులు పుచ్చుకొన్నాడు.

"ఒక్క వారం రోజులు ఓపికపట్టండి. ఎరియర్స్ రాగానే మీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను" అంటూ ఆయనను బ్రతిమిలాడుకొని పంపించే సరికి ఆకలి చచ్చిపోయినట్లనిపించింది.

నాలుగు మెతుకులు కతికి బట్టలు వేసుకొని ఆఫీసుకు బయలుదేరుతుంటే బియ్యం నిండుకొన్న విషయం గుర్తు చేసింది.

తల ఊపి సైకిలు తీయబోయాడు. అదీ కదలనంటూ మొరాయించింది.

తన కర్మకి నిందించుకొంటూ కాళ్లీడ్చుకొంటూ ముందుకు నడిచాడు.

చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పులు, తల్లి కర్మకాండానికి తీసుకొన్న చేబదుళ్లు నెత్తిమీద మోయలేని భారాన్ని మోపాయి. జీతంలో ఎక్కువ భాగం వాటి తాలూకు అప్పులకీ, వడ్డీలకు పోతుంటే మిగిలిన దానితో సంసారాన్ని నెట్టుకురావటం కత్తిమీద సాములా అనిపిస్తుంది.

అద్దె కట్టలేక పోతున్నాడు. పాలబాకీ పెరిగిపోతోంది. కిరాణా షాపువాడికి మొహం చూపించలేకపోతున్నాడు. తండ్రిని మంచి డాక్టరుకు చూపించటం అసాధ్యమైపోయింది. చివరకు కట్టుకొన్న దానికి ఓ చీర కొనటం, ఎప్పటి నుండో గొడవ చేస్తున్న బాబీకి ఓ క్రికెట్ బాట్ కొనివ్వటం కలలో కోరికలుగా మిగిలిపోతున్నాయి.

ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న ఎరియర్స్ వస్తే కొంత వెసులుబాటుగా ఉంటుందనుకుంటే అదీ ఆలస్యమైపోతోంది.

బతుకు ఓ దయ్యపు నీడలా భయం కలిగిస్తోంది.

ఆ రోజు ఆఫీసుకు వెళ్లగానే ముందు ఎరియర్స్ గురించి వాకబు చేశాడు.

పిడుగులాంటి వార్త వినిపించింది.

పేబిల్సు తప్ప అడ్వాన్సులు, టిఏలు, ఎరియర్స్ లాంటి మరే ఇతర బిల్లులు పాస్ చెయ్యకూడదని గవర్నమెంటు ఆర్డరు వేసిందట.

ఖజానా కాళీ అవటంతో ప్రభుత్వ పరంగా సామాన్యుడికి ఎటువంటి సహాయం లభించదని నిర్ధారణ అయింది.

కడుపు మండి పోయింది వెంకట్రావుకి. కళ్లు తిరిగినట్లనిపించింది.

ఖజానా కాళీ అవటానికి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలను ఉద్ధరించిందని! ఏ పేదవాడి కన్నీరొత్తి దారి చూపించిందని! నీటి కోసం అల్లాడి పోతున్న వాళ్లకి గొంతు తడుపుకోను గుక్కెడు నీళ్లయినా ఇచ్చిందా? గుడ్డి దీపమైనా వెలిగించి బతుకుల్లో చీకట్లను పారద్రోలగలిగిందా?

అవినీతి పరులు, గూండాలు, కీర్తికండూతి కలవాళ్లే ప్రజా పాలకులైతే వాళ్ల ఖజానాలు నింపుకోవటం తప్ప ప్రజల అవసరాలేం పట్టించుకొంటారు!

ఇక కొల్లాయి కట్టి ప్రజాసేవే పరమావధిగా తలచే మహాత్ముడు వీళ్లకు ఆదర్శం అని చెప్పుకోవటం ఎంత హీనవంచన!

ఏమైనా తన దౌర్భాగ్యం కొద్దీ ఈ జీవిత వైకుంఠపాళిలో అడుగడుగునా కాలనాగులే కాటేయ్యాలని నోళ్లు తెరుచుకొని చూస్తున్నాయి.

ఒక్క నిచ్చెన మెట్టయినా ఎక్కి పైకి రాగలడా తను!




నిరాశ మనసుని క్రుంగదీస్తుంటే ఎవరో 'సార్!' అని పిలిచినట్లనిపించి ఉలిక్కి పడ్డాడు.

ఎదురుగా నవ్వుతూ వరహాలరావు!

ఒకొక్క చేతికి నాలుగేసి ఉంగరాలు, ముంజేతికి బ్రాస్‌లెట్, మెళ్లో గోల్డ్ చెయిన్, పెద్దపొట్ట, ఖద్దరు సిల్కు షర్టు బాపతు వరహాలరావంటే అదోలాంటి ఏవగింపు వెంకట్రావుకి.

"మీరా! ఏమిటి మళ్లీ వచ్చారు?" రవంత విసుగుతో అన్నాడు.

"నా బిల్లు సంగతి ఏం చేశారు?'

'టైం పడుతుంది. మేం వెరిఫై చేసుకోవాలి.'

మాట పూర్తికాక ముందే టేబిలపై టప్పున నోట్ల కట్టలు పడ్డాయి.

"పదివేలు. కావాలంటే ఇంకా అడుగు. కాని బిల్లు పాస్ చేయించటం ఏమంత కష్టం కాదు. కాకపోతే సిరి రా మోకాలొడ్డినట్లు వెర్రివాడిలా ప్రవర్తించకు. నేను ఆఫీసు ఎదురుగా ఉన్న కాంటీన్‌లో ఉంటాను. ఏ విషయమూ సాయంత్రంలోగా చెప్పు" అంటూ నోట్ల కట్టల్ని తిరిగి బాగ్‌లో వేసుకొని వెళ్లిపోయాడు.

దిగ్భ్రాంతితో చూస్తుండి పోయిన వెంకట్రావు కర్చీఫ్ తీసుకొని మొహం తుడుచుకొన్నాడు.

వరహాలరావు వెళ్లిపోయినా కళ్లముందు నోట్ల కట్టలే కనిపిస్తున్నాయి.

ఇంటద్దె, పాలవాడి బాకీ, తండ్రి జబ్బు, బియ్యం నిండుకొన్న విషయం అన్నీ గుర్తొస్తున్నాయి. పరిష్కరించలేని సమస్యలన్నీ మెడకు ఉచ్చుతాళ్లుగా బిగుసుకొని ఊపిరాడకుండా చేస్తున్నాయి.

ఈ పరిస్థితిలో పదివేలు!

తలుచుకుంటేనే పూలఊయల్లో పట్టు గాలిలో ఊయలూగుతున్న అనుభూతి కలుగుతోంది. ఇక ఆ డబ్బు సొంతమైతే!

స్టాఫంతా ఫైల్సు సర్దుకొని వెళ్లిపోతున్నారు.

వెంకట్రావు కూడా లేచాడు.

దారేమిటో కానరాని అంధకారంలో వెయ్యి విద్యుద్దీపాలు వెలిగించబోతున్నట్లనిపించి కాంటీన్ కేసి నడిచాడు.

అతడిని చూస్తూనే వరహాలరావు నవ్వుతూ "పైకొస్తావయ్యా" అంటూ నోట్ల కట్టలు అందించాడు.

తీసుకొంటున్నప్పుడు కాస్తంత చెయ్యి వణికినా బంధవిముక్తుడైనట్లు మనసెంతో తేలిక పడింది.

జేబు నిండుగా డబ్బు ఉండేసరికి ఎంతో ధైర్యం వచ్చి నట్లనిపించి ఉత్సాహంగా ఇంటి దారి పట్టాడు.

ముందు పాలవాడి మొహం వాచేలా చివాట్లు పెట్టి మరీ డబ్బు ఇవ్వాలి. ఇంటి యజమానికి మర్యాద నేర్చుకోమని చెప్పాలి. కిరాణా షాపువాడిని కొట్టు మార్చేస్తానంటూ బెదిరించాలి. రేపే తండ్రిని డాక్టరుకు చూపించి మంచి మందులిప్పించి పితృ ఋణాన్ని కొంతయినా తీర్చుకోవాలి అనుకున్నాడు. కాని విచిత్రంగా ఆ ఆనందం గంటయినా నిలవేలేదు వెంకట్రావుకి. ఇల్లు దగ్గర పడుతుంటే జేబుతోపాటు గుండె కూడా బరువెక్కినట్లనిపించింది.

తనది కాని సొమ్ము జేబులో ఉన్నట్లు మనసు బితుకు బితుకు మంటోంది. జేబులో గుడ్డి గవ్వ లేనప్పుడు కూడా ఇంత భారంగా అనిపించ లేదు.

బాకీలన్నీ తీర్చేస్తాడనుకొంటే బాగానే ఉంది. కాని తన కష్టార్జితంతో కాదనుకొన్నప్పుడు హృదయం బాధగా మూలిగింది. రాజ్యానికి కొత్తచీర కొంటే ఆ చీరలో తను మెరిసిపోతుంటే ఆనందించటానికి బదులు పరాయి వాళ్ల డబ్బుతో రాజ్యాన్ని సింగారించినందుకు సిగ్గుతో తల వాలిపోదూ! అలాగే తండ్రి కోలుకుని లేచి తిరుగుతుంటే లంచం డబ్బు గుర్తొచ్చి తన అసమర్థతకి క్రుంగిపోడూ!

ఈ డబ్బుతో ఇప్పుడు సమస్యలు తీరినా రేపు ఏ అవినీతివరుడినో, లంచం గొండినో చూసినప్పుడు అంతరాత్మ తనని నిలదియ్యదూ!

ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టాయి.

ఏవేవో కొనుక్కొని ఇంటికి వెళ్లాలనుకొన్న వెంకట్రావు ఏదీ కొనకుండానే నాలుగు వీధులు తిరిగి ఇల్లు చేరుకున్నాడు.

రాజ్యం ఎదురొచ్చి "ఏమిటంత ఆలస్యమైంది. మధ్యాహ్నం మామయ్య గారికి ఆయాసం ఎక్కువ కావటంతో కంగారు పెట్టేశారు. పక్కింటి పిన్నిగారితో కలిసి వాళ్లకు తెలిసిన డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాం. ఇంజక్షను చేసి మందులు రాసిచ్చారు. ఇప్పుడు కొంచెం కులాసాగా ఉన్నారనుకోండి" అంది.

"డబ్బెక్కడిది?" అప్రయత్నం గా అడిగాడు.

'బావుంది. డబ్బు కోసం చూసుకొంటే జబ్బు తగ్గదుగా! అందుకే ముక్కు పుడక అమ్మేశాను.'

నిర్ఘాంతపోయాడు. వివాహమయ్యాక రాజ్యం మొదటి సారిగా కోరి చేయించుకున్న ముక్కు పుడక! ఎంతో అపురూపంగా చూసుకునేది.

ఆవేదన చెందాడు.

తండ్రిని పలకరించి బాబీతో కొంచెం సేపు కాలక్షేపం చేశాక భార్యతో నెమ్మదిగా చెప్పాడు పదివేల గురించి.

నిర్ఘాంతపోతూ 'ఎందుకు తీసుకొన్నారండీ?' అంది.

"తప్పదు రాజ్యం! ఇప్పుడున్న పరిస్థితిల్లో తీసుకోక తప్పలేదు."

రాజ్యం మొహంలో నిరసన కనిపించింది.

"మధ్య తరగతి వాళ్లకు జీవితం ఒక పోరాటం. విజయమో, వీరస్వర్గమో కడదాకా వేచి చూడాలి కాని పక్కదారి పట్టి పతనమై ఓడిపోవటం నేను భరించలేనండీ! ఈ డబ్బుతో పైకి రాగలమనుకొంటున్నారు. కాని నా దృష్టిలో పతనమై పరిస్థితుల ముందు ఓడిపోవటమే ఇది!"

వెంకట్రావు సంభ్రమంతో చూశాడు. అప్పటివరకు పడిన మానసిక వేదనంతా గాలికెగిరి పోయినట్లనిపించింది.

మరునాడు ఆఫీసులో వరహాల రావుకి డబ్బు ఇచ్చేస్తూ 'నే నెప్పటికీ ఓడిపోను' అనుకొన్నాడు గర్వంగా.